మూసారంబాగ్ బ్రిడ్జి అలైన్‌మెంట్ మార్చాలి



సమావేశంలో పాల్గొన్న ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సభ్యులు

మలక్‌పేట: ప్రతిపాదిత మూసారంబాగ్ బ్రిడ్జి నిర్మాణ అలైన్‌మెంట్ మార్చాలని బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న అండర్ సైజ్డ్ ప్రాపర్టీ యాజమానులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వెస్ట్‌ప్రశాంత్‌నగర్ వర్గో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రతిపాదిత నమూనాతో బ్రిడ్జి నిర్మాణం చేపడితే తమ జీవనోపాధికి ఆధారమైన ఆస్తులు కోల్పోయి నడిరోడ్డు పాలవుతామని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి 29.5 మీటర్ల వెడల్పుతో రూపొందించారని, ఇరువైపులా 3.5 మీటర్ల వెడల్పు గల ఫుట్‌పాత్, రెండు దిశలకు 3 లైన్ క్యారేజీ ఉండగా.. అదనంగా మూసారంబాగ్ వైపు ఉన్న అప్రోచ్ రోడ్డు పొడవు 250 మీటర్లు ఉందని, దీంతో 40 మంది ఆస్తులపై ప్రభావం పడుతుందన్నారు. అభివృద్ధిని స్వాగతిస్తున్నామని, అయితే ప్రతికూల ప్రభావాలను తగ్గించడానికి నిర్మాణ నమూనాలో సవరణ చేయాలని కోరుతున్నామన్నారు. ఈ సవరణలు చేయడం ద్వారా తమ కష్టాలను తగ్గించడమే కాకుండా, జీహెచ్ఎంసీకి గణనీయమైన ఖర్చు ఆదా అవుతుందన్నారు. గతంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చామని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ప్రజా దర్బార్‌లో కూడా ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. ముఖ్యమంత్రి ఈ అంశాన్ని పరిశీలించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి ధనుంజయ, ఉపాధ్యక్షుడు నిరంజన్ సాగర్, సలహాదారులు రవీందర్, ప్రకాశం, అశోక్, దశరథ్‌గౌడ్, హమీద్ అన్సారీ, వెంకటేష్ పాల్గొన్నారు.

కబ్జా చెర వీడిన రోడ్డు

- కార్పొరేటర్ ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం



రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడను జేసీబీతో కూల్చివేయిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

మన్సూరాబాద్: రాత్రికి రాత్రే రోడ్లు, పార్కు స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో హయత్‌నగర్ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి కబ్జా చెర నుంచి రోడ్డును కాపాడారు. వివరాల్లోకి వెళ్తే... మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి ఎల్లారెడ్డి కాలనీ, పవనగిరి కాలనీ, లక్ష్మీభవానీనగర్ కాలనీల లింకు రోడ్డుకు అడ్డంగా కొందరు గోడను నిర్మించి రోడ్డు స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించారనే కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పందించి బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ ప్రాంతం గుండా ట్రంక్ లైన్ పనులు ప్రారంభమవుతున్నాయని, రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని వెంటనే కూల్చివేయాలని, లేనిపక్షంలో తానే కూల్చివేయిస్తానని కార్పొరేటర్ హయత్‌నగర్ టౌన్ ప్లానింగ్ అధికారులను హెచ్చరించారు. దీంతో స్పందించిన టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం రోడ్డును ఆక్రమించి నిర్మించిన గోడను జేసీబీతో కూల్చి వేయించారు. గతంలో మాదిరిగానే రోడ్డును పునరుద్ధరించడంతో సమీప కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

విగ్రహం ఏర్పాటును అడ్డుకోవడంతో ఉద్రిక్తత



వంగవీటి మోహన రంగా విగ్రహం ఏర్పాటు పనులను అడ్డుకున్న బసవేశ్వర సేవా సంఘం ప్రతినిధులు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలో మహాత్మా బసవేశ్వర విగ్రహం వద్ద ఏపీకి చెందిన దివంగత నేత వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు కొందరు గురువారం పనులు ప్రారంభించగా, మహాత్మా బసవేశ్వర సేవా సంఘం ప్రతినిధులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బసవేశ్వరుని విగ్రహం వద్ద మరో విగ్రహాన్ని ఎలా పెడతారంటూ వారు అభ్యంతరం చెప్పారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొనగా, సమాచారం అందుకున్న వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. దిమ్మె నిర్మాణానికి పూనుకున్న వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. అనుమతులు లేకుండా ఎలాంటి విగ్రహాలు పెట్టడానికి వీలులేదని ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు. ఈ విషయంపై పోలీసులకు, తహసీల్దార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని బసవేశ్వర సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో బసవేశ్వర సేవా సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకర్, ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కుశాల్ కుమార్, సంయుక్త కార్యదర్శి సంతోష్ నీలకంఠ, ఎం.ఎస్.కుమార్, అంజయ్య పాల్గొన్నారు.

కాలనీ రోడ్డులో మద్యం షాపుల అనుమతి రద్దు చేయాలి



వీరభద్రనగర్ కాలనీ వాసులతో కలిసి మద్యం షాపు ముందు ఆందోళన నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

వైన్ షాపు ముందు బీజేపీ ఆందోళన

హయత్‌నగర్: కాలనీకి వెళ్లే దారిలో వైన్స్, బార్‌లు ఏర్పాటు చేస్తున్నారని, కాలనీ వాసులకు ఇబ్బంది కలిగించే మద్యం షాపుల అనుమతులను రద్దు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వీరభద్రానగర్ కాలనీవాసులతో కలిసి బీజేపీ నాయకులు మద్యం షాపు ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ... కాలనీకి వెళ్లే నాలుగు రహదారుల్లో వైన్స్, బార్‌లకు లైసెన్సులు ఇచ్చారని, ఆయా షాపుల కారణంగా నిత్యం మద్యం ప్రియుల ఆగడాలతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మద్యం షాపుల కారణంగా కాలనీలోని మహిళలు, విద్యార్థులు సాయంత్రం పూట బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. కాలనీ వాసులు గతంలో కూడా వ్యతిరేకించినా అధికారులు పట్టించుకోలేదని, ఈసారి మరో బార్‌కు అనుమతిచ్చారని అన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మద్యం షాపుల లైసెన్సులను రద్దు చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఉగాది ఎల్లప్ప, పారంద మహేష్, సత్యనారాయణ, గోవిందా చారి, వెంకటేష్, జనార్ధన్, కాలనీ వాసులు అజయ్, స్వామిగౌడ్, విజయ్ పాల్గొన్నారు.

నోళ్లు తెరిచిన మ్యాన్‌హోళ్లు!

- ప్రమాదాల బారిన జనం
- పట్టించుకోని జలమండలి

మలక్‌పేట: జలమండలి అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణ సంకటంగా మారుతోంది. మూతలు పగిలి నోళ్లు తెరిచి ఉన్న మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో జనం నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్‌ల్లో మ్యాన్‌హోళ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎక్కడ చూసినా మూతల్లేని మ్యాన్‌హోళ్లు దర్శనం ఇస్తున్నాయి. శాలివాహననగర్ పార్కు ఎదురు లేన్‌లో, మూసారంబాగ్ మెట్రోమాల్‌కు వెళ్లే దారిలో ఈ పరిస్థితి ఉంది. నిత్యం ఎంతో మంది ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. దారి మధ్యలో మ్యాన్‌హోల్ నోరు తెరిచుకుని ఉంది. జలమండలి అధికారులు బడా నాయకులు చెబితే కానీ కదలని పరిస్థితి ఉందని, వారి పనితీరు మార్చుకోవాలని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని మ్యాన్‌హోళ్లపై మూతలు బిగించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చి తమ కష్టాలను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.



మూసారంబాగ్ మెట్రోమాల్ రోడ్‌లో..



శాలివాహన నగర్ పార్కు ఎదురుగా..

అధికారులు వేగంగా స్పందించాలి



ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోళ్లను గుర్తించి వెంటనే మూతలు బిగించాలి. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకముందే సమస్యను గుర్తించి పరిష్కరిస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. చిన్న చిన్న సమస్యలకు కూడా నెలల తరబడి సమయం తీసుకోవడం వల్ల ప్రజల్లో అసహనం పెరుగుతోంది. కాబట్టి అధికారులు వేగంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– సత్యానంద్, అక్బర్‌బాగ్

ఆస్తి పన్ను వసూళ్లపై ఎన్నికల ఎఫెక్ట్

- ఎల్‌బీనగర్ 3 సర్కిళ్లలో పన్ను టార్గెట్ రూ.212.20 కోట్లు
- ఇప్పటి వరకు వసూళ్లు రూ.103.94 కోట్లు
- మిగతా రూ. 108.26 కోట్ల కోసం తీవ్ర కసరత్తు



ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయం

ఎల్‌బీనగర్: ఎన్నికల వేళలో ఆస్తి పన్ను వసూళ్లలో వేగం తగ్గింది. అధికారులు, సిబ్బంది అంతా ఎన్నికల విధుల్లో ఉండటంతో పన్ను వసూళ్లను అంతగా పట్టించుకోలేదు. దీంతో ఆస్తి పన్ను వసూలు మందగించిందనే చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను టార్గెట్‌ను పూర్తి చేస్తారో.. లేదో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆస్తి పన్ను చెల్లింపు గడువు మార్చి నెలాఖరుకు ముగుస్తుండటంతో ఎల్‌బీనగర్ సర్కిళ్ల అధికారులు తమ తమ టార్గెట్లను చేరుకునేందు ముమ్మర కసరత్తు చేస్తున్నారు.
- మూడు సర్కిళ్ల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం వసూళ్ల టార్గెట్ రూ. 212.20 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.103.94 కోట్లు వసూలు చేశారు. మిగిలిన రూ.108.26 కోట్లు వసూలు చేసేందుకు అధికారులు తీవ్రంగా కష్ట పడాల్సి ఉంది.
- మరో రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికల సమీస్తుండటంతో ఇప్పటికే అధికారులు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సిబ్బంది ఒక వైపు ఎన్నికల విధులు, మరోవైపు ఆస్తి పన్ను వసూళ్ల కోసం తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది.
- ఇక ఆస్తి పన్నులు భారీగా బకాయి ఉన్న వారికి రెడ్ నోటీసులు జారీ చేసి అనంతరం వారెంట్ జారీ చేసి.. ఆ తర్వాత కూడా పన్నులు చెల్లించకుంటే జప్తు మంత్రం ఉపయోగించి పన్నులను రాబట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

మూడు సర్కిళ్లలో వసూళ్ల వివరాలు ఇలా....

ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగిస్తుంది. దీంతో గడువుకు ముందే తమ టార్గెట్‌ను పూర్తి చేయాలని అధికారులు అనుకుంటున్నారు. ఇక సర్కిళ్ల వారీగా ఈ ఆర్థిక సంవత్సరం టార్గెట్‌ను పరిశీలిస్తే సర్కిల్–3లో రూ 74.01కోట్లు కాగా, ఇప్పటి వరకు వసూలు చేసింది రూ. 36.05కోట్లు.

- సర్కిల్ –4లో రూ.62.56కోట్లు కాగా, ఇప్పటికి రూ.31.15 కోట్లు వసూలు చేశారు.
- సర్కిల్–5లో రూ. 75.63 కోట్లు కాగా, వసూలు చేసింది రూ.36.74కోట్లు.
- మూడు సర్కిల్‌లో మిగిలిన రూ. 108.26 కోట్ల పన్నుల వసూలుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 19, వంకాయ 45, బెండ 50, పచ్చిమిర్చి35, కాకర 55, బీర 50, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 16, కారెట్ 35. దొండ 60, ఆలు 23, ఉల్లి 25, గోకర 50, దోస 28, సొర 15, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 65, అర్వి 50, మునగ 75, చిలగడదుంప 45.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ లలితానగర్‌లోని గడ్డిఅన్నవరక్షేత్ర వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పూర నర్సింహగుప్తా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. అలాగే జనవరి 1వ తేదీన స్వామివారికి వెన్నతో అలంకరణ, విశేష అర్చన ఉంటుందన్నారు. 11న కూడారై ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి 108 గంగాళాలతో పాయసం సమర్పిస్తామన్నారు. జనవరి 14న ఉదయం 9 గంటలకు శ్రీగోదా రంగనాధుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఆలయ సలహాదారు వసంత్‌మనోహర్, కోశాధికారి రమేష్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

పహాడీషరీఫ్: కబ్జాలపై ఎట్టకేలకు అధికారులు కన్నెర్ర చేశారు. మండల పరిధిలోని మామిడిపల్లిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్న వైనంపై 'సాక్షి' దినపత్రికలో 'యథేచ్ఛగా కబ్జాల పర్వం' అనే శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి బాలాపూర్ రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ మాధవిరెడ్డి ఆదేశాలతో ఆర్.ఐ జమీల్ గురువారం ఉదయాన్నే కబ్జాకు గురైన సర్వే నంబర్ 99/1లోని స్థలానికి చేరుకొని పహాడీషరీఫ్ పోలీసులు, జల్‌పల్లి మున్సిపాలిటీ, విద్యుత్ అధికారుల సహకారంతో జేసీబీలతో కూల్చివేతలు చేపట్టారు. అనంతరం ఆ స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

మంత్రి పొన్నంకు సత్కారం



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న శ్రీ నూతన గౌడ్ కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుడు, పోరుబిడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను గురువారం శ్రీనూతన గౌడ్ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ, పొన్నం ప్రభాకర్ ధైర్యశాలి అని, తెలంగాణ ఉద్యమంలో ముందు వరసలో ఉండి రాష్ట్ర సాధన కోసం పోరాడన్నారు. కార్యక్రమంలో శ్రీ నూతన గౌడ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మామిడి రామకృష్ణ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మిట్టపల్లి విజయ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బత్తుల రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు ఉపేందర్ గౌడ్, ఆర్గనైజర్ శ్రీ ప్రగతి గౌడ్, గౌరవ అధ్యక్షుడు మొగిలి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఉపాధి కల్పించాలి: సీఐటీయూ



సీఐటీయూ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

లింగోజిగూడ: ఆటో కార్మికులకు ఉపాధి కల్పించి వారి సంక్షేమం కోసం బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కదారి రాములు డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు న్యాయం చేయాలని గురువారం ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో ఆటో కార్మికులతో కలిసి చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారుగా 80 లక్షల మంది కార్మికులు రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. వీరి సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకొని ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి స్కీం పథకం వల్ల మహిళలు బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయడం వల్ల ఆటోల్లో ప్రయాణించే వారు లేక వాటిపై ఆధారపడిన వారందరూ రోడ్డున పడ్డారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీరయ్య, మారయ్య, కృష్ణమూర్తి, రాజు, తిరుపతి, రాము, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కొత్తపేటలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు

నాగోలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను కొత్తపేటలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకుడు పడమటి అశోక్ యాదవ్, ఆకారం నర్సింగ్, జవాజి జ్ఞానేశ్వర్, సంపత్‌గౌడ్, భార్గవ్, రవి, శేఖర్, రోహిత్, ఎండీ మసూద్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రంతో శుభాకాంక్షలు..



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నీటి రంగులతో ఆయన చిత్రాన్ని కాన్వాస్‌పై చిత్రించి శుభాకాంక్షలు తెలిపిన ఎల్‌బీనగర్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు నాగార్జునపు రాము – నాగోలు

పర్యావరణ పరి రక్షణ అందరి బాధ్యత

బడంగ్‌పేట్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కార్పొరేషన్ పరిధి నాదర్‌గుల్ స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల ఎకో క్లబ్ విద్యార్థులు అన్నారు. ప్రజలకు కాలుష్యంపై అవగాహన కల్పించేందుకు ఎకో క్లబ్ విద్యార్థులు 20 ఎలక్ట్రిక్ వాహనలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో 40 మంది సభ్యులు కళాశాల నుంచి బడంగ్‌పేట్, నాదర్‌గుల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని కళాశాల కార్యదర్శి ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలుష్యం మితిమీరితే ప్రకృతి విలయతాండవాన్ని ఆపలేమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వెంకటకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డా.మహేశ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిసె వాసులకు న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే



గుడిసెల వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: జాతీయ రహదారి విస్తరణలో రోడ్డుపక్కన వేసుకున్న నివాసాలు కోల్పోతున్న వారికి తగిన న్యాయం చేస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్‌లోని రేడియో స్టేషన్ పక్కన గుడిసెలు వేసుకొని ఉంటున్న వారు నివాసాలు కోల్పోతున్నారని తెలుసుకున్న ఆయన అక్కడికి వెళ్లి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... గతంలో క్రీడా పక్కన గుడిసెలు ఉండగా, అక్కడ బస్ టెర్మినల్ ప్రతిపాదన రావడంతో అక్కడి నుంచి గుడిసెలను ఇక్కడికి తరలించామన్నారు. వారికి కనీస సౌకర్యాలు కల్పించి వారు వ్యాపారం చేసుకునేలా సహకరించామన్నారు. ఉన్నఫలంగా వారిని ఖాళీ చేయమని అధికారులు గుడిసెలను తొలగిస్తున్నారన్నారు. గుడిసె వాసులకు న్యాయం చేయాలని గతంలో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడానని, మరోసారి మాట్లాడి తగిన న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

భావ వ్యక్తీకరణకు వక్తృత్వ పోటీలు దోహదం



వక్తృత్వ పోటీల్లో మాట్లాడుతున్న విద్యార్థి

మలక్‌పేట: విద్యార్థులు భయం లేకుండా ఆత్మవిశ్వాసంతో తమ భావాలను వ్యక్తం చేయడానికి వక్తృత్వ పోటీలు దోహదపడతాయని నారాయణ హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నారం ఒలింపియాడ్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం వ్యక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ పాఠశాలలో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అంశాలలో పిల్లలకు తగిన తర్ఫీదు ఇస్తే మరింతగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్ స్కిల్స్ విభాగం రీజినల్ ఇన్‌చార్జి రవితేజ, శైలజ, ఏజీఎం హేమాంబర్, ఆర్ఐ రవిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రాధిక, ఏఓ అశోక్, ఏడీ శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదోన్నతిపై మార్కెట్ సెక్రటరీ బదిలీ



రవీందర్‌రెడ్డిని అభినందించిన చైర్మన్ అనితానాయక్

చాదర్‌ఘాట్: మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ గ్రేడ్–3 సెక్రటరీ వేముల రవీందర్‌రెడ్డి ప్రమోషన్‌పై గ్రేడ్–2గా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌కు బదిలీ అయ్యారు. గురువారం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా చైర్మన్, అనితా నాయక్ మాట్లాడుతూ, మార్కెట్ అభివృద్ధికి రవీందర్‌రెడ్డి చేసిన సేవలు మరవలేనివని అన్నారు. ఎస్‌జీఎస్ దామోదర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

24న ఇంజినీర్స్ కాలనీ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అల్వాల్‌రెడ్డి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 24న నిర్వహించనున్నట్లు కాలనీ సమన్వయకమిటీ కో కన్వీనర్ వి.అల్వాల్‌రెడ్డి వెల్లడించారు. కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటు కోసం రెండు సార్లు సమావేశాలు నిర్వహించినా ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈనెల 24న జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేశామన్నారు. కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ కమిటీ తీర్మానం మేరకు నూతన కమిటీని ఏర్పాటు చేయడానికి నిర్వహించే కాలనీ సర్వసభ్య సమావేశానికి సభ్యులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు. నూతన కమిటీ ఏర్పాటుకు కాలనీ ప్రతినిధులు సహకరించాలని , కాలనీ ప్రతిష్టను దెబ్బతీసేలా కొంతమంది చేస్తున్న వదంతులను నమ్మవద్దని కాలనీ ప్రతినిధులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మంఖాల శేఖర్‌రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు నర్సిరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బాల్‌రెడ్డి, అల్వాల్‌రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ కందికంటి వెంకన్న

మన్సూరాబాద్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని గురువారం హయత్‌నగర్‌లో భవాని దివ్యాంగుల సేవా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కందికంటి వెంకన్న ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. హయత్‌నగర్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ నరసింహ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి దివ్యాంగులకు కాలివర్, స్టిక్స్, దుప్పట్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో షిరిడీ సాయినగర్‌కాలనీ అధ్యక్షుడు డాక్టర్ నర్సింహయాదవ్, ఎర్రం పూర్ణశాంతి, గుత్తికొండ కిరణ్, శివ, పాండు, దాసరి బాబు, శ్రీకాంత్, భాస్కర్, రామచంద్రరావు, సంతోష్‌కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.